ప్రజాశక్తి
బుధవారం 17 మే 2023
5
అల్లూరి సీతారామరాజు

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామంలో సోమవారం రాత్రి విద్యుత్ షాకు గురైన దోలి శ్రీను (30) అనే యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ కథనం ప్రకారం... చింతపల్లి మండలం తోటరాజు బంద గ్రామానికి చెందిన దోలి శ్రీను కుటుంబ సభ్యులతో తన అత్తవారు గ్రామమైన రాజవొమ్మంగి మండలంలోని చిన్నయ్యపాలెం వచ్చారు. సోమవారం రాత్రి ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ మీటర్ సరిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి శ్రీను కింద పడిపోడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు తొలత జడ్డంగి పిహెచ్‌సికి తరలించగా వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ రిఫర్ చేశారు. శ్రీను కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా మోదమ్మ అనుపోత్సవం

- కిక్కిరిసిన పాడేరు ప్రధాన రహదారి
- కట్టిపడేసిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భద్రతకు పటిష్ట పోలీసు బందోబస్తు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అనుపోత్సవంలో విగ్రహం, పాదాలు మోస్తున్న ఐటిడిఎ పిఒ, ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపిపి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యం ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ జాతర మూడు రోజుల పాటు ఘనంగా జరిగింది. తొలి రోజు ఆదివారం ఉత్సవ విగ్రహం, అమ్మవారి పాదాలను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకు వచ్చి శతకంపట్టు వద్ద కొలువు తీర్చడంతో ఉత్సవాలు ఆరంభం అయ్యాయి. శతకంపట్టు వద్ద కొలువుదీర్చిన ఉత్సవ విగ్రహం అమ్మవారి పాదాలను తిరిగి ఆలయానికి చేర్చడంతో ఉత్సవాలు ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ ఉత్సవాలకు ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర ముగింపు సందర్భంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం శతకంపట్టు వద్ద నాలుగున్నర గంటల తర్వాత ప్రారంభమైన అనుపోత్సవానికి భక్తులు పోటెత్తారు. శతకంపట్టు నుంచి మోదకొండమ్మ ఆలయం వరకు ఉత్సవ విగ్రహం, పాదాలు ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆలయ కమిటీ చైర్‌పర్సన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిన్నయ్యదొర, తదితరులు అమ్మవారి విగ్రహం, పాదాలను తలకెత్తుకుని అనుపోత్సావాన్ని ప్రారంభించి ముందుకు సాగారు. శతకంపట్టు నుంచి సుంద్రుపుట్టు సాయిబాబా గుడి, మెయిన్ రోడ్డు, అంబేద్కర్ కూడలి మీదుగా మోదకొండమ్మ దేవాలయం వరకు ఊరేగింపు సాగింది. అమ్మవారి పాదాలను తలపైకి ఎత్తుకునేందుకు, తాకేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఉత్సవాల ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. డప్పులతో తరలి వచ్చి అమ్మవారికి ఘటాలు సమర్పించుకున్నారు. డప్పు కళాకారులు, ఊరేగింపులో వివిధ వేషధారణలు, విన్యాసాలు, బ్యాండ్ లు, తప్పెట గుళ్ళు, నేల వేషాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల సమస్యలు లేకుండా, తొక్కిసలాట జరగకుండా పోలీసులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఉత్సవాల మూడు రోజులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీగా బాణసంచా కాల్చారు. అనుపోత్సవ కార్యక్రమంలో జెసి జె.శివ శ్రీనివాసు, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, ఎఎస్ పి ధీరజ్ కునుబిల్లి, స్థానిక సిఐ బి.సుధాకర్, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ టి.నర్సింగరావు, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము నాయుడు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొట్టగుల్లి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శులు ఎన్.కొండబాబు, టి. ప్రసాదరావు నాయుడు పాల్గొన్నారు.

అనుపోత్సావంలో జనాలతో కిక్కిరిసిన పాడేరు ప్రధాన రహదారి

జాతర జరిగిందిలా..

మోదకొండమ్మ ఉత్సవాలు మూడు రోజులు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేశారు. తొలి రోజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌టి కమిషన్ చైర్మన్, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, మాజీ ఉపముఖ్యమంత్రి, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జడ్‌పి చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ టి.నరసింగరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ప్రముఖులను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహుకరి ంచారు. ఎస్‌పి అతుల్ సిన్హా, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, పాడేరు, చింతపల్లి ఎఎస్ పిలు ధీరజ్ కునుబిల్లి, కిషోర్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో వందలాదిగా పోలీసులు పహారా కాశారు.

పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పణ

పాడేరు టౌన్: మోదకొండమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని టిటిడి తరఫున ఆలయ చైర్మన్, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, డాక్టర్.టి.నర్సింగరావు దంపతులు, ఉమ్మడి విశాఖ జెడ్‌పి చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, మూర్తి దంపతులు పట్టు వస్త్రాలు పసుపుకుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా వారు టిటిడికి, సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ ప్రధానకార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.

భానుడి భగభగలోనూ భక్తిపారవశ్యం

పాడేరు టౌన్: గిరిజనుల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల చివరి రోజైన మంగళవారం భక్తులు, బంధువులతో పట్టణ వీధులన్నీ సందడిగా మారాయి. మండువేసవిలో సైతం లెక్క చేయకుండా ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నాలుగు రోజులుగా పాడేరులో పట్టణంలో ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం మొదలైంది. ఎండ తీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే జనం ఎండ నుంచి రక్షణ పొందేందుకు గొడుగులు, తువ్వాళ్లను ఉపయోగించుకున్నారు. మంగళవారం ఊహించని రీతిలో ఎండ తీవ్రత ఉండడంతో ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు.

ముగింపు వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాల సందడి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం, జనసేన ప్రజాప్రతినిధులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- అధికారులకు సిపిఎం, జనసేన ప్రజాప్రతినిధుల వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని సిపిఎం, జనసేన పార్టీల ప్రజాప్రతినిధులు ఉమ్మడిగా మంగళవారం ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇలకు వినతిపత్రాలు అందజేశారు. మండలంలోని రేగులపాడు, లింగాపురం, కూటూరు, చూచిరేవుల గూడెం గ్రామాల్లో తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల గ్రామాల్లో ప్రజలు నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కొమరం పెంటయ్య, సాంబశివ, ఎంపిటిసిలు అమ్మాజీ, జయసుధ, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, కర్నాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఎస్‌పి జగదీష్

బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు పటిష్ట చర్యలు

- ఎఎస్‌పి జగదీష్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పాఠశాలల్లో బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహల్లి తెలిపారు. ఇటీవల జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను అదే పాఠశాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు లైంగిక వేధింపులకు గురి చేశారన్న ఫిర్యాదులపై మంగళవారం ఎఎస్‌పి జగదీష్ దర్యాప్తు నిర్వహించారు. అనంతరం ఆయన జడ్డంగి పోలీస్ స్టేషన్లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశంపై పోలీసులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో ఇటీవల జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులు జరిగినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఇకపై సచివాలయ మహిళా పోలీసుల ద్వారా ప్రతి పాఠశాలలో క్రమం తప్పకుండా ఈ అంశంపై అవగాహన కల్పిస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులపై బాధిత విద్యార్థినులు లిఖితపూర్వక వాంగ్మూలం ఇచ్చారని, వారికి ఎదురైన లైంగిక వేధింపుల అనుభవాలను అందులో తెలియజేశారని పేర్కొన్నారు. ఈ కేసు విషయంలో పాఠశాల హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల నుండి కూడా వివరాలు సేకరించినట్లు తెలిపారు. నిందితులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు వారిపై పోక్సో కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి సీఐ బాజీలాల్, జడ్డంగి ఎస్ఐ షరీఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బందవలస గెడ్డపై బ్రిడ్జి నిర్మించరూ..!

గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళన

అర్థాంతరంగా నిలిచిన బ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని వేంగ్డ పంచాయతీ బంధవలస గ్రామం వద్ద గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక గిరిజనులు మంగళవారం ఆందోళన చేపట్టారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి, సిపిఎం మాజీ సర్పంచ్ సివేరి. కొండలరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు బ్రిడ్జి వద్ద నిరసన చేపట్టారు. వర్షాల సీజన్ రాకముందే కల్వరు నిర్మాణం చేపట్టి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ, బందవలస వద్ద గెడ్డపై బ్రిడ్జి కొట్టుకుపోవడంతో మెట్టపాడు, డాలింగిపుట్టు, బంజాడ, పెనంతి, డొంకపుట్టు తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారన్నారు. ప్రస్తుతం వేసవి సీజన్‌లో గెడ్డలో దిగి కాలినడకన దాటే పరిస్థితి ఉన్నా, ఏమాత్రం వర్షాలు కురిసినా, ఉప్పొంగి ప్రవహించే గెడ్డలో దిగి దాటి వెళ్లడం ప్రాణసాహసమే అవుతుందున్నారు. ప్రస్తుతం స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు చొరవతో వేంగ్డ మెయిన్ రోడ్డు నుండి బంధవలస మీదుగా మెట్టపాడు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో, అందులోనే భాగంగానే బందవలస గెడ్డపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే, బ్రిడ్జి నిర్మాణం జరిగితేనే ఈ మార్గంలో రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాఫీగా సాగే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై తాను సర్పంచ్‌గా పదవిలో ఉన్న సమయంలోనే సంబంధిత అధికారులను కలిసి లిఖితపూర్వకంగా విన్నవించినా, ఎటువంటి ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సరే అధికారులు స్పందించి బందవలస గెడ్డపై వంతెన సమస్య పరిష్కరించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తానన్నారు. గామస్తులు అప్పన్న పాల్గొన్నారు

నేడు గిరిజన సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గడ్డిమరి గ్రామంలో ఈనెల 17న జరిగే గిరిజన సంఘం జిల్లా మహాసభలో గిరిజనులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, మేధావులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, కృష్ణారావు అన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులు, గిరిజన చట్టాల పరిరక్షణకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో దీనిపై జిల్లా మహాసభలో చర్చించి, వాటిపరిరక్షణకు అందరూ నడుము బిగించి ఐక్యతగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై మహాసభలో చర్చించి,కార్యాచరణ రూపొందిస్తారన్నారు. గిరిజన మేథావులు, విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నేతలు అప్పలకొండ, పడాలి అప్పారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలు, హక్కుల రక్షణకు ఐక్య పోరాటాలు

గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సూరిబాబు

మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సూరిబాబు, హాజరైన గిరిజనులు

ప్రజాశక్తి-కొయ్యూరు

గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణకు ఆదివాసీలంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సూరిబాబు పిలుపునిచ్చారు. కొయ్యురు మండలం రోడ్డు చింతలపూడిలో గిరిజన సంఘం మండల మహాసభ ఆ సంఘం నాయకులు పి.బొంజన్న మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ బోయ వాల్మీకిలు, బెంతు, ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, జిఒ 3ను పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టం-2006ని పటిష్టంగా అమలు చేసి పోడు భూముల సాగు చేస్తున్న గిరిజనులందరికీ 10 ఎకరాలకు తగ్గకుండా పట్టాలివ్వాలని కోరారు. నూతన అటవీ పాలసీని వెనక్కి తీసుకోవాలని, స్పెషల్ డిఎస్‌సి ప్రకటించి నూరు శాతం పోస్టులతో భర్తీ చేయాలని, అన్నిశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కొయ్యూరులో 50 పడకల ఆసుపత్రి, పెదమాకవరం కేంద్రంగా పిహెచ్‌సిని ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో జీడి పిక్కలకు ధర లేకపోవడంతో దళారుల పాలవుతుందని, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అందువల్ల జీడి పిక్కలను ఐటిడిఎ, జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలని, గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గిరిజన సంఘం మండల కమిటీ ఎన్నికైంది. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా జంపా పెంటయ్య, పాంగి గంగరాజు, 12 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు, గిరిజన సంఘం నాయకులు ఎల్.రమేష్, పి.వరహాలు, శ్రీను, మల్లేష్, రాంబాబు, మేడ కన్నయమ్మ, కె.రాజులమ్మ, పి.బొజ్జన్న, కె.శంకర్, కన్నయమ్మ పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులు పెంటయ్య, గంగరాజు

పరిహారం చెల్లించాకే పనులు చేపట్టండి

సిపిఎం మండల కార్యదర్శి పోతురాజు

మాట్లాడుతున్న సిపిఎం నేత పోతురాజు

ప్రజాశక్తి డుంబ్రిగూడ: ఎన్‌హెచ్ 516 రహదారి విస్తరణలో దుకాణాలు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులందరికీ పూర్తిస్థాయి పరిహారం చెల్లించకుంటే ఆందోళన చేపడుతామని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌పి పోతురాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్డు విస్తరణకు దుకాణాల తొలగింపు పనులు అధికారులు చేపట్టారు. వీటిని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించినప్పటికీ, కొంతమందికి చెల్లించకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారన్నారు. నష్టపరిహారం చెల్లింపు విషయంలో సంబంధిత ఎన్‌హెచ్ అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని, అరకొర పరిహారం చెల్లించిన వారికి మిగతా పరిహారం ముట్టజెప్పాకే విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.

అణచివేతపై తిరుగుబాటు ఖాయం

సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు

ప్రజాశక్తి-విఆర్.పురం

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అణచివేత ధోరణి విడనాడకపోతే ప్రజల్లో తిరుగుబాటు వచ్చి ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు హెచ్చరించారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రావలసిన మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్టు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని, లాక్ అలవెన్స్‌లు, పని ముట్లు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో తునికాకు 50 ఆకుల కట్ట ధర రూ.5కు తగ్గకుండా చెల్లిస్తేనే కార్మికులకు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. కార్మికులకు బోనస్ సకాలంలో చెల్లించాలని, 2012 నుండి 2019 వరకు పెండింగ్‌లో ఉన్న బోనస్ ఇవ్వాలని కోరారు. తునికాకు సేకరణలో కార్మికులు, వడదెబ్బ, పాము కాటు వాటికి గురైతే చికిత్స కోసం ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన యువతకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ 3ను రద్దు చేయడంతో మూడేళ్లగా యువత తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కుంజా నాగిరెడ్డి, పూనెం ప్రదీప్ కుమార్, గూటాల శ్రీనివాసరావు, సవలం మారయ్య, తోడం రాజు, కారం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు చిన్నబాబు, ప్రదీప్‌కుమార్ తదితరులు

గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చిట్టెంపాడు పంచాయతీ పరిధి గోపవరం గ్రామంలోని యువతకు అల్లూరి సీతారామరాజు జిల్లా యువజన గిరిజన సేవ సంఘం ఆధ్వర్యంలో దాతల న ప ా కా ో ం తో మంగళవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. చిట్టెంపాడు ఉపసర్పంచ్ ధారలక్ష్మి, సచివాలయ కన్వీనర్ పెట్ల గాంధీ, సింహాచలం, వైసిపి కార్యకర్త ధారమల్లేశ్వరావు, వాలంటీర్ పవన్, గ్రామ మునసబు నాగరాజు చేతులు మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు టి.మల్లేష్ మాట్లాడుతూ గిరిజన యువతను ప్రోత్సహించడంలో తమ సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. గిరి యువత చదువుతో పాటు క్రీడల్లో మంచి పట్టు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేస్తున్న గిరిజన సేవా సంఘం ప్రతినిధులు

ఘనంగా గంగాలమ్మ పండగ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని దూసరపాము గ్రామంలో గ్రామ దేవత గంగాలమ్మ పండుగ మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చీడి శివ, గ్రామ పెద్దల ఆధ్వర్యాన కులమతాలకు అతీతంగా ఈ పండగ జరిగింది. నేల వేషాలు వేసే 18 మంది కళాకారుల బృందం కాంతార, కనకదుర్గమ్మ, శక్తి, రావణాసురుడు, శివపార్వతులు, దశమగణాలు, కాళికాదేవి, తదితర వేషాలు ప్రదర్శించారు. వీటిని ప్రజలు, భక్తులు ఆసక్తిగా తిలకించారు. ముఖ్యంగా కాంతార నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది

కాంతార నృత్యం చేస్తున్న కళాకారులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

నాణ్యతా ప్రమాణాలతో 'నాడు - నేడు' పనులు

- రూ.200 కోట్లతో 1255 పాఠశాలల అభివృద్ధి
- ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన బడి నాడు-నేడు రెండవ దశ పనుల్లో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంకోట్లాది రూపాయలు వ్యయం చేస్తోందని, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరిగితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండవ దశ నాడు నేడు పనులు, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీపై ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఎటిడబ్ల్యుఒలు, వెలుగు ఎపిఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు నేడు రెండవ దశలో 10శాతం కాంపోనెంట్స్ లో 895 పాఠశాలల అభివృద్ధి, 335 తరగతి గదులు, 25 ప్రహరీల నిర్మాణాలు మంజూరయ్యాయన్నారు. నాడు నేడు పనులకు కొనుగోలు చేసిన నిర్మాణ సామగ్రి రిజిస్టర్, వ్యయ వివరాల రిజిస్టర్, ఎంబుక్ పక్కాగానిర్వహించాలని ఆదేశించారు. ఈ వారం రూ.4 కోట్లు ఖర్చు చేసారని, వచ్చేవారానికి రూ. 5 కోట్లు ఖర్చు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లకు నాణ్యమైన టైల్స్, తలుపులు, శానిటరీ పరికరాలు కొనుగోలులో నాణ్యతలు పాటించాలని స్పష్టం చేసారు. తాగునీటి పనులకు, విద్యుత్ పరికరాలకు ఇండెంట్ పెట్టాలని సూచించారు. పాఠశాల విద్యను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించబోమన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎంపిడిఒలు సమీక్షా సమావేశాలు నిర్వహించి, బడిబయట ఉన్న పిల్లల వివరాల రిజిస్టర్, పోషకాహార లోపం బలహీనంగా ఉన్న పిల్లల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న విద్యా కానుక కిట్లు సకాలంలో పాఠశాలలకు సరఫరా చేయాలని స్పష్టం చేసారు. నాడు నేడు పనుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించామని, వారు జగనన్న విద్యా కానుక పుస్తకాలు, బ్యాగులు, షూల పంపిణీని పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యాశాఖాధికారులు, ఎటిడబ్ల్యుఒలు, సచివాలయం సిబ్బంది సమన్వయంతో పనిచేసి సకాలంలో జెవికె కిట్లు పంపిణీ చేయాలన్నారు. అధికారులు సక్రమంగా పని చేయకుంటే భవిష్యత్తులో పరిణామాలు ఉండవని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే పాల్గొనగా, సమావేశంలో టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, ఇఇ డివిఆర్ఎం రాజు, డిఆర్ డిఎ పిడి వి.మురళి, ఆర్ డబ్ల్యుఎస్ ఇఇ లీలా కృష్ణ, మన బడి నాడు-నేడు ఎపిఒ ఎంఎస్ఎల్ పాత్రుడు, పాడేరు డివిజన్ ఎంఇఒలు, ఎటిడబ్ల్యుఒలు, పాల్గొన్నారు.

జి.మాడుగుల ఎంఇఒ సస్పెన్షన్

జి.మాడుగుల మండలంలో మంగళవారం తాను పర్యటించానని, అక్కడ ఎంఇఒ లేదని, కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి ఎంఇఒ నాగభూషణం గైర్హాజరయ్యారని కలెక్టర్ మండిపడ్డారు. దీనికి బాధ్యులను చేస్తూ ఎంఇఒను సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

డిప్యూటీ డిఇఒకు సత్కారం

ప్రజాశక్తి -హుకుంపేట: అల్లూరి జిల్లా ఉప విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన స్థానిక మండలవాసి సోమేలి చెల్లయ్యను మంగళవారం పాఠశాల ప్రత్యేకాధికారులు ఘనంగా సత్కరించారు. మారుమూల మన్యం నుంచి ఉన్నత చదువులు చదివి. ఇదే ప్రాంతానికి జిల్లాస్థాయిలో డిప్యూటీ డిఇఒగా బాధ్యతలు చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేస్తూ, దుశ్శాలువా, మిఠాయిలు అందజేసి అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ చెల్లయ్య మాట్లాడుతూ, అందరి సహకారంతో మన్యవాసులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ ప్రాంతానికి చెందిన గిరిజన ఉద్యోగిగా విద్యా, గిరిజన సంబంధిత సమస్యలన్నీ సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, గిరిజన విద్యాభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

ఎన్నాళ్లీ ప్రసవ వేదన !

» డోలీ మోత, కాలినడకనే గర్భిణిని ఆసుపత్రికి తరలింపు
» సకాలంలో వైద్యం అందడంతో తల్లీ బిడ్డ క్షేమం
» ఊపిరిపీల్చుకున్న గర్భిణి కుటుంబసభ్యులు

అర్ధరాత్రి వేళ 108లో పిహెచ్‌సికి తరలింపు

ప్రజాశక్తి-అనంతగిరి: మన్యంలో మారుమూల గ్రామాల్లోని గర్భిణులకు ప్రసవ వేదనలు తప్పడం లేదు. రహదారులు, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఏ సమయంలో పురిటినొప్పులు వచ్చినా, వారిని ఆసుపత్రులకు తరలించడం కుటుంబసభ్యుల శక్తిమీద సామే అనే పరిస్థితి ఉంది. అన్ని అనుకూలిస్తేనే సరేసరి, లేకుంటే తల్లీబిడ్డల ప్రాణాలు గాల్లో దీపాల్లే పరిస్థితి ఉంది. కానీ సోమవారం రాత్రి పెదకోట పంచాయతీ, బందకొండలో గిరిజన మహిళ ప్రసవకష్టాలు సుఖాంతం కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలో పెదకోట పంచాయతీ బందకొండ గ్రామానికి చెందిన మజ్జి భీమలమ్మకు సోమవారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో పురిటినొప్పులు తీవ్రంగా వచ్చాయి. గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే కనీసం రహదారి సౌకర్యం, రవాణా, రాకపోకలకు ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతోపాటు రాత్రి వేళ కావడంతో కుటుంబీకులు ఎంతో ఆందోళన చెందారు. మరో ఆలోచన చేయకుండా డోలీకట్టి, అందులో ప్రసవ వేదన పడుతున్న భీమలమ్మను ఉంచి బందకొండ నుంచి పాటిపల్లి వరకు సుమారు రెండు కిలోమీటర్లు దూరం కొండమార్గంలో డోలిలోనే గర్భిణిని తీసుకొచ్చారు. అప్పటికే సమాచారం అందుకున్న 108 వాహనం సిద్ధంగా ఉండగా, అందులో హుకుంపేట మండలం ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు, అక్కడ వైద్యులు అందుబాటులో ఉండి, సకాలంలో సరైన వైద్యసేవలు అందడంతో భీమలమ్మ పండంటి బిడ్డకు సుఖప్రసవం ద్వారా జన్మనివ్వడం, తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నామని భీమలమ్మ భర్త దేముడు తెలిపాడు.

రోడ్డు, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో తాము నిత్యవసరం, అత్యవసరానికి అనునిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నామని, అయినా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక గిరిజనులు ఆవేదన చెందుతున్నారు మండలంలో కొన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరౌతున్నా, అటవీ శాఖ అభ్యంతరాలు, కోర్టులతో పనులు జరగడం లేదని వాపోతున్నారు. ప్రజల ప్రయోజనాలకు ఇలా అభ్యంతరాలు చెప్పడం ఏంటో అంతుపట్టడం లేదని, అధికారులుగానీ, నేతలుగానీ ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడంతో ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్నా స్వాతంత్ర్య ఫలాలనేటికీ తాము ఇక్కట్లు పడుతూనే ఉన్నామని మన్యవాసులు ఆందోళన, ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ ప్రవేశాలకు గ్రామాల్లో ప్రచారం

ప్రజాశక్తి- అనంతగిరి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, గిరిజన ప్రాంతంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను తమ కాలేజీలో చేర్పించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్లు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు మంగళవారం అనంతగిరి, ఎగువశోభ, బొర్రా, కాశీపట్నం, లంగపర్తి, వేంగడ, వాలసి, గుమ్మ తదితర పంచాయతీ గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, నేరుగాప్రచారం నిర్వహించిన లెక్చరర్లు, స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, టోకూరు సర్పంచ్ కె .మొస్య, సిపిఎం మండల నాయకులు ఎస్ .నాగులు, జె. సుబ్బారావు, తదితరులను కలిసి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రవేశాలకు సహకరించాలని కోరారు. ఈ మేరకు కరపత్రాలను, తమ కాలేజీలో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ కాలేజీ లెక్చరర్లు తవిటినాయుడు, రామకృష్ణ, శంకర్‌నాయక్, గోవింద ప్రచారంలో పాల్గొన్నారు.

అనంతగిరి జూనియర్ కాలేజీలో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి, సిఇసి గ్రూపులున్నాయని, అన్ని సబ్జెక్టులకు పూర్తిస్థాయి లెక్చరర్లు ఉన్నారని, కాలేజీలో పూర్తిసౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యాబోధన, ప్రభుత్వపరంగా అన్ని రాయితీలు, సౌకర్యాలు పొందే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న మన కాలేజీలోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పదవ తరగతి పాస్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డు, తల్లి బ్యాంకు అకౌంట్, ఆధారకార్డు, విద్యార్థి ఫొటోలు ఇలా అందుబాటులోనే కాలేజీని సంప్రదించి ప్రవేశం పొందవచ్చన్నారు. ఎంపిసి, బైపిసి గ్రూపులకు రూ.రెండు వేలు, సిఇసి, హెచ్ఇసి గ్రూపులకు రూ.800 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

బ్లూఫ్లాగ్‌తో తీరప్రాంతాలకు గుర్తింపు

ప్రజాశక్తి-మధురవాడ : రుషికొండ బీచ్‌కి బ్లూఫ్లాగ్ లభించడం పర్యాటకులను మరింతగా ఆకర్షించగలదని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్రవిభాగం, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి శాఖ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన సదస్సులో నిపుణులు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఇ.కృష్ణ మాట్లాడుతూ, 1987 సంవత్సరంలో యూరప్‌లో బ్లూఫ్లాగ్ మొదటి సారిగా ప్రారంభించారని, తదనంతర కాలంలో దాదాపు 48 దేశాలలో ఐదు వేలకుపైగా బీచ్‌లకు బ్లూఫ్లాగ్ గుర్తింపు లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజనీర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసపతి తన ప్రసంగంలో తీరప్రాంత పర్యాటకం అభివృద్ధిలో బ్లూఫ్లాగ్ ప్రాధాన్యతను వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, పర్యావరణ శాస్త్రవిభాగం అధిపతి డాక్టర్ వి.సరిత, కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

ఆంధ్రా ఊటీని అట్టుడికిస్తున్న ఎండలు!

వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మన్యవాసులు
గణనీయంగా తగ్గిన సందర్శకులు.. పర్యాటక కేంద్రాలు వెలవెల

ప్రజాశక్తి అనంతగిరి : ఆంధ్రా ఊటీ అరకు, అనంతగిరి ప్రాంతాల్లోనూ ఎండలు మండిపోతున్నాయి. ఏ సీజన్‌లోనైనా పచ్చని అడవులు, జమ్ముకశ్మీరులను తలపించేలా పర్యాటకులకు కనువిందు చేసే ఆహ్లాదకర వాతావరణం అల్లూరి మన్యం సొంతం. అయితే ఈ ఏడాది ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. మండుతున్న ఎండలు, వడగాలులు, ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. స్థానిక గిరిజనులను ఇళ్లల్లో ఉండలేక చెట్ల నీడకు, తోటల్లోకి పరుగులు పెడుతున్నారు. పిల్లలు, పెద్దలు ఇలా అందరూ గ్రామాలకు సమీపంలోని గెడ్డల్లోనే ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లోనూ చల్లని నీటిలో ఈతకొడుతూ సేదదీరుతున్నారు. మంగళవారం ఎగువశోభ పంచాయతీ మర్ధగూడ గెడ్డలో మధ్యాహ్నం వేళలో ఎండ నుంచి ఉపశమనానికి చిన్నారులు స్నానాలు చేస్తున్న దృశ్యం ప్రజాశక్తి కెమెరాకు చిక్కింది.

నిత్యం చల్లని, ఆహ్లాదకర వాతావరణం ఉండే ఏజెన్సీలోనే ఎండలు,వడగాలుల బీభత్సం సృష్టిస్తుంటే మైదాన ప్రాంతాల్లో పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నాయోనని మన్యవాసులు అంటున్నారు. ఏటా సీజన్‌లో మైదానప్రాంతంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి, ఇంకా దేశవిదేశాల నుంచి కూడా పర్యాటకులు పాడేరు మన్యానికి తరలివచ్చి ఇక్కడ ఉపశమనం పొందే పరిస్థితి ఉండేది. కానీ ఈ ఏడాది ఇక్కడే ఎండల తీవ్రత వల్ల పర్యాటకుల తాకిడి గణనీయంగా తగ్గిందనే చెప్పాలి. బొర్రా గుహలు, వాటర్ ఫాల్స్, కాఫీ ప్లాంటేషన్, అనంతగిరి, అరుకు వ్యూపాయింట్లు, అరకు, డుంబ్రిగుడ ఇతర ప్రాంతాలకు తండోపతండాలుగా వచ్చే పర్యాటకుల తాకిడి ఈ ఏడాది గణనీయంగా తగ్గడంతో వెలవెలబోయి కనిపిస్తున్నాయి. మరో రెండు మూడు రోజులు ఇదే పరిస్థితులు కొనసాగితే, ఆహ్లాదం, ఉపశమనం వంటి మాటలను పక్కనబెడితే, మన్యంలో తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే దుస్థితి తప్పకపోవచ్చని స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు

మర్ధగుడ గెడ్డలో స్నానాలు చేస్తూ సేద తీరుతున్న గిరిబాలలు

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రుణాలు పెంచాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు ఇచ్చే రుణాలను, టిడ్కో హౌసింగ్‌కి ఇచ్చే రుణాలను మరింత పెంచాలని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కోరారు. మంగళవారం దశపల్లా హోటల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత రంగానికి బ్యాంకర్లు ఇవ్వాల్సిన రుణాలు వాటి లక్ష్యాల కంటే తక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ బ్యాంకులు రుణాలు తక్కువగా ఇస్తున్నాయని, కౌలు రైతులకు లోన్ పెంపుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ ఇంకా ఆశించిన స్థాయిలో ఫలితాల దిశగా ప్రైవేట్ బ్యాంకుల ప్రయత్నం లేదని అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగత్ కిషన్ రావు కరాడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, ఫైనాన్స్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శంషేర్ సింగ్ రావత్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల అక్రమ అరెస్టులు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విధి నిర్వహణలో ఉన్న క్లాప్ డ్రైవర్లు 23 మందిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి, అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఫోర్త్ టౌన్ స్టేషన్ ఎదుట జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. జోన్ 4, 5 పరిధిలో అరెస్టు చేసిన 23 మంది క్లాప్ డ్రైవర్లను తక్షణం విడుదల చేయాలని, వారిపై పెట్టిన తప్పుడు కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జీవో ప్రకారం రూ.18,500 జీతాలు చెల్లించాలని నినదించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న క్లాప్ డ్రైవర్లను అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఎక్కడిదని ప్రశ్నించారు. క్లాప్ డ్రైవర్లు చేసిన తప్పు ఏమిటని అడిగారు. జీవో 7 ప్రకారం రూ18,500 జీతాలు ఇవ్వాలని అడగడం నేరమా అన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు రూ.18,500 జీతం చెల్లిస్తున్నారని, వారు చేస్తున్న పనులనే క్లాప్ డ్రైవర్లు కూడా చేస్తున్నారని చెప్పారు. జివిఎంసి ఆధ్వర్యంలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాల్సి ఉండగా, కాంట్రాక్టర్ రూ.12,000 మాత్రమే చెల్లిస్తున్నారని, రకరకాల పేర్లు చెప్పి రూ.2 వేల వరకు కోత విధిస్తున్నారని తెలిపారు. రూ.10 వేలతో క్లాప్ డ్రైవర్ల కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. తప్పు చేసింది కాంట్రాక్టం కనుక ఆయనపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారందరినీ తక్షణం విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులు రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు పాల్గొన్నారు.

ఆగస్టు నుంచి పిపోనెట్ మొబైల్ యాప్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రైలు టెక్ రైల్వే స్టేషన్ వైఫై నెట్‌వర్క్ ద్వారా పిపోనెట్ మొబైల్ యాప్‌ను ప్రారంభించామని, ఇది ఆగస్టు నుంచి దేశ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని నరే భారత్ నెట్ వర్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాక్స్ కృష్ణ తెలిపారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంగ్లీషులో పాటు 8 ప్రాంతీయ భాషలలో ఇది అందుబాటులోకి వస్తుందన్నారు.

'బాడీ కేర్'తో మేలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చిన్నారుల బట్టలు, విన్నర్ వేర్‌లు అందించే బాడీ కేర్ సంస్థ మూడు దశాబ్దాలుగా దేశంలోని మిలియన్ తల్లుల విశ్వాసం పొందడం గర్వకారణమని ఆ సంస్థ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మిథున్ గుప్తా అన్నారు. నగరంలోని ఓ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాజల్ అగర్వాల్ బాడీ కేర్ కిడ్స్ అంబాసిడర్‌గా సంతకం చేశారన్నారు. పిల్లల డిమాండ్లను తీర్చడానికి ఆకర్షణీయమైన ప్రింట్‌లతో దుస్తులను అందివ్వడంపై తాము దృష్టి పెట్టినట్లు తెలిపారు.

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ డిపిఆర్ మార్చాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్ అభివృద్ధికి రూ.152 కోట్లతో రూపొందించిన డిపిఆర్ మత్స్యకారులకు ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదని, దాన్ని తక్షణం మార్చాలని మత్స్యకార ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న వేలం షెడ్డును ఉన్న చోటనే అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని, వేలం షెడ్డు - 2 పేరుతో మరో చోట వేలం షెడ్‌ను అభివృద్ధి చేయడం తమకు ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదని అన్నారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మత్స్యకార ఐక్యవేదిక కన్వీనర్ చీకటి రమేష్, గంగా గౌరీ భవాని ఫిషింగ్ హార్బర్ చేపల వేలం పాటల సంఘం అధ్యక్షుడు మూగి రాజు, మత్స్యకార సంఘం నాయకులు కె.చంద్రశేఖర్ మాట్లాడారు. స్థానిక మత్స్యకారుల డిమాండ్లను తెలియజేశారు.

క్షణక్షణం..భయం భయం

- పరిశ్రమల్లో ప్రమాదాలతో ప్రాణాలు పోతున్నాయి
- బతికుంటే జబ్బులు వెంటాడుతున్నాయి
- ఎల్‌జి పాలిమర్స్, వసుధా ఫార్మా, స్మైలెక్స్, మైలాన్, అరబిందో, ఎస్సెన్స్, అభిజిత్ కంపెనీల్లో మృత్యువాత పడ్డ బాధిత కుటుంబాల ఆవేదన
- విశాఖలో 'పారిశ్రామిక మరణాలకు బాధ్యులెవరు ?' రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఫార్మా కంపెనీల్లో కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోంది. రియాక్టర్ల నాణ్యతా లోపంతో ప్రమాదం సంభవిస్తే ప్రాణాలు పోతున్నాయి. యాజమాన్యాలను శిక్షించే చట్టాలు వారికి చుట్టాలుగా మారిపోతున్నాయి. ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఇఒడిబి) పేరుతో ఫ్యాక్టరీస్, లేబర్ డిపార్టుమెంట్ అధికారుల చేతులు కట్టేయడంతో యాజమాన్యాల ఆగడాలకు ఆకాశమే హద్దుగా మారిపోయింది. నష్టపరిహారం పేరుతో కుటుంబీకుల ప్రాణాలకు వెలకట్టి యాజమాన్యాలు చేతులు దులుపుకుంటున్నా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంతో చోద్యం చూస్తోంది' అంటూ ప్రమాద బాధిత కుటుంబీకులు తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. మంగళవారం విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'పారిశ్రామిక మరణాలకు బాధ్యులెవరు?' అన్న అంశంపై సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా గుజరాత్‌కు చెందిన పీపుల్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చి సెంటర్ (బరోడా) పర్యావరణ నిపుణులు జగదీష్ పటేల్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలు, ఫార్మా రంగాల్లో పలు చోట్ల నానాటికీ ప్రమాదాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. ఈ ఘటనల్లో కార్మికులు మృత్యువాత పడుతున్నా యాజమాన్యాలు వారిపైనే నిందలు మోపుతూ తప్పించుకుంటున్నాయని తెలిపారు. యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వీటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో రియాక్టర్ల పని విధానం, వాటి నాణ్యతపై తనిఖీల్లేకుండా ప్రభుత్వ విధానం ఉండడం వల్లే ప్రాణాంతక ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఇవి పారిశ్రామిక ప్రమాదాలు కావని, ప్రభుత్వాల హత్యలని పేర్కొన్నారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలు ఫార్మా, ఇతర పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో మృతిచెందిన కుటుంబాలకు చెందిన వారు సదస్సులో పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

బాబాయ్ చనిపోయాడు.. నా భర్త అవిటి వాడయ్యాడు : అప్పలనర్సమ్మ

'స్మైలెక్స్ కంపెనీలో ఈ ఏడాది జనవరి 5న జరిగిన ప్రమాదంలో మా బాబాయ్ మేడిశెట్టి పైడిరాజు మృతిచెందారు. నా భర్త వనం అప్పారావు మంచం పట్టాడు. నెలల తరబడి తేరుకోలేని స్థితి ఉంది' అని బాధితురాలు వి.అప్పలనర్సమ్మ ఈ సదస్సులో తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. పై అంతస్తులోకి వెళ్లి పనిచేస్తున్నప్పుడు సరైన రోప్ (తాడు) లేనందున అది తెగి కిందకు వారు పడిపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని వివరించింది.

సదస్సులో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

మరికొందరు..

అభిజిత్ పరిశ్రమలో మే 1న జరిగిన ప్రమాద విషయంలో సిఐటియు చొరవతో యాజమాన్యం దిగివచ్చి రూ.13 లక్షలను బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చిందని ఆర్.రాము వెల్లడించారు. ఎస్సెన్స్‌లో ప్రొక్లెయిన్ మీద నుంచి కింద పడి డ్రైవర్ కాలు తెగిపోయిందని, ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నాడని తెలిపారు. ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన 2020 మే 7న జరిగిందని పేర్కొంటున్నా.. వాస్తవానికి 6వ తేదీ రాత్రి 10 గంటలకే స్టైరీన్ గ్యాస్ లీకేజీ మొదలైందని, అక్కడున్న వ్యక్తి మెయిన్‌టైన్ చేయలేక తప్పించుకుని పారిపోయాడని ఉరుకూటి రాజు వెల్లడించారు. తెల్లవారుజామున 2 గంటలకు వెంకటాపురం గ్రామం అంతా గ్యాస్ లీకై విస్తరించి 15 మంది మృత్యువాతకు దారితీసిందన్నారు. గ్యాస్ పీల్చి వేలాది మంది బాధితులుగా మారారన్నారు. కంపెనీకి వెనుక భాగంలోగల మేఘాద్రి గెడ్డవైపు వేల సంఖ్యలో ప్రజలంతా పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారని, ముందు వైపు వెళ్లిన వారంతా గ్యాస్ పీడితులై నేటికీ రోగాల బారిన పడుతూ అవస్థలతో జీవనం సాగిస్తున్నారని ఆయన వివరించారు. ఎల్‌జి.పాలిమర్స్ ఘటనానంతరం నేటికీ పిల్లలకు తల వెంట్రుకలు ఊడిపోతున్నాయని, పెద్దవాళ్లకు కీళ్లనొప్పులు, ఆయాసం తరచూ వస్తున్నాయని అన్నారు. అచ్యుతాపురం వసుధా ఫార్మా కంపెనీలో తన తమ్ముడు ఫిట్టర్‌గా చేరి గత ఏప్రిల్‌లో 50 అడుగుల పై నుంచి కిందపడిపోవడంతో మృతిచెందాడని, యాజమాన్యం సాయంత్రం వరకూ తమకు సమాచారం ఇవ్వలేదని పైగా భద్రతా సూట్ వేసుకోనందునే మృతిచెందాడని నిందారోపణ చేసిందని రూప సభలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మనిషే లేనప్పుడు పరిహారం పేరుతో ఎన్ని లక్షలు యాజమాన్యం ఇచ్చినా ఏం ఉపయోగం ఉంటుందని ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సిఐటియు ఈ విషయంపై అవిశ్రాంత పోరాటం చేయబట్టే యాజమాన్యం దిగివచ్చిందని చెప్పారు.

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రస్తుత ఎండాకాలంలో వడగాల్పులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం సహాయ కార్మిక కమిషనర్ సర్కిల్ -2 బుద్ధ మునిస్వామి అన్నారు. మంగళవారం కార్మిక అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా ఆయన సమావేశమయ్యారు. సంస్థల, దుకాణాల యజమానులు వడగాలులపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అవకాశం ఉన్న మేరకు పని దినాలలో సమయ మార్పులు చేయాలని సూచించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పని చేసే చోట్ల సేద తీర్చుకోవటానికి షెడ్లు, చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ సిబ్బందితో సంప్రదింపులు చేస్తూ ఉండాలని ఆదేశించారు.

లలలల

డెంగీ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజవొమ్మంగి, జడ్డంగి, లాగరాయి పీహెచ్సీల వైద్యాధికారులు ఉషాశ్రీ, శ్రీదుర్గా, యామిని, సుజి, రవీంద్ర అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆయా పిహెచ్సిల గ్రామాల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్య సిబ్బంది సిహెచ్ ప్రసాద్, నాగవాసు, సుధాకర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి, జీడిగుప్ప పిహెచ్‌సిల నుండి రేఖపల్లి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ దోమ తెరలను వాడటం ద్వారా డెంగీని నివారించవచ్చని చెప్పారు. ఇంట బయట పరిసరాల పరిశుభ్రతను పాటించాలాన్నారు. మంచినీరు, కొబ్బరి బొండాలు, పండ్లు రసాలు, మజ్జిగ వంటివి తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, జీడిగొప్ప డాక్టర్ రోజారమణి, పిహెచ్ ఎన్ భద్రకాళి, హెచ్‌వి పున్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఎఎన్ఎంలు, ఎస్‌హెచ్‌ఎలు పాల్గొన్నారు.

నేడు విశాఖలో చంద్రబాబు పర్యటన

- పెందుర్తిలో రోడ్ షో, బహిరంగ సభ

ప్రజాశక్తి - పెందుర్తి

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం విశాఖలో పర్యటించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు శాంతి కల్యాణ మండపం సమీపంలోని కాస్మో ప్రైమరీ స్కూల్ నుంచి ఆయన రోడ్ షో ఉంటుంది. 6 నుంచి 7 గంటల వరకూ పెందుర్తి కూడలిలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తారు. దీంతో చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం సరిపల్లి గ్రామంలోని చర్చి వెనుక వైపు ఆయన బసకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బహిరంగ సభ విజయవంతానికి ఏర్పాట్లు

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా పెందుర్తిలో జరిగే బహిరంగ సభకు టిడిపి అధినేత చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం పెందుర్తిలోని 96వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు కార్యాలయంలో రాష్ట్ర నాయకులు కిమిడి కళా వెంకట్రావు, బుద్దా వెంకన్న, బండారు సత్యనారాయణమూర్తి, పీలా శ్రీనివాసరావు తదితరులు సమావేశమయ్యారు. ఏర్పాట్లుపై సమీక్షించారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ జగన్ హయాంలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్ళిందని, యువత నిరుద్యోగ బాట పట్టిందని అన్నారు. కళా వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శాడిస్ట్ అని, చంద్రబాబు అవినీత రహిత పాలన అందించడం చూసి ఓర్వ లేక ఏదో ఒక కేసులో జైల్లో పెట్టించాలని ఆరాటపడుతున్నాడని విమర్శించారు.

పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మాట్లాడుతూ పేదవారికి 16 వేలకుపైగా టిడ్కో ఇళ్లు ఇచ్చిన ఘనత కేవలం చంద్రబాబు నాయుడుదని పేర్కొన్నారు. పంచ గ్రామాల సమస్యను నాడు చంద్రబాబు హయాంలో ఒక కొలిక్కి తీసుకొచ్చినప్పటికీ వైసిపి ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. పెందుర్తిలో జరిగే సభలో ప్రధానంగా మత్స్యకారుల సమస్యలు, ముదపాక భూముల విషయం, పంచ గ్రామాలు, తాడి గ్రామం తరలింపు, టిడ్కో హౌసింగ్ సమస్యలపై చంద్రబాబు ప్రసంగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం స్థానిక నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.